క్లుప్తంగా

వృద్ధులకు దుప్పట్లు, పండ్ల పంపిణీ



మచిలీపట్నంటౌన్: తులసి హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన గురువారం చిలకలపూడిలో అన్నపూర్ణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు శాంతిశ్రీ, భానుతేజ దంపతులు, శాంతిశ్రీ సోదరుడు లంక వెంకటరత్నం సహకారంతో అందజేశారు. నిర్వాహకుడు బొడ్డు తులసిరామ్ మాట్లాడుతూ నగరంలోని పలు పేదల కాలనీల్లో అన్నదానాలు చేస్తూ వారి ఆకలి తీర్చడానికి కృషి చేస్తున్నామన్నారు. వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కర్రెడ్ల సుశీల, శాంతిశ్రీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖుడు చిట్టా పూర్ణ మృతి



నాగాయలంక: దివిసీమలో నాటి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నాగాయలంక ఆర్యవైశ్య సంఘాల పెద్ద, సీనియర్ ఎరువుల వ్యాపారి చిట్టా వెంకట పూర్ణచంద్రరావు(87) గురువారం ఉదయం మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు మనుమలు ఉన్నారు. చిట్టా మరణ వార్త తెలుసుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

విద్యుత్ వెతలు తీర్చడానికే అదాలత్



అవనిగడ్డ: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకే కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ చెప్పారు. స్థానిక రెవెన్యూ సమావేశపు హాలులో గురువారం విజయవాడ సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యాన అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 11 మంది అర్జీలు సమర్పించగా వాటిని సదస్సులోనే పరిష్కరించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు ఎం.సత్యానంద్, ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్, ఉయ్యూరు, అవనిగడ్డ, చల్లపల్లి సబ్ డివిజన్ల ఇంజినీర్లు, ఏఈలు పాల్గొన్నారు.

స్వామివారికి వెండి నాగపడగ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అవనిగడ్డ మండలం పులిగడ్డ గ్రామానికి చెందిన మండలి నిహారి నాగపడగను సమర్పించారు. గురువారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం 450 గ్రాముల వెండి నాగపడగను స్వామివారికి కానుకగా ఆలయ ఉపకమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ అధికారులు సత్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు

మచిలీపట్నంటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15,16,17 తేదీల్లో చల్లపల్లిలో జరిగిన సీపీఎం జిల్లా మహాసభలో నూతన కార్యవర్గ ఎన్నిక, జిల్లా అభివృద్ధికి దోహదం చేసే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేసే భారాలను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు, టీవీ లక్ష్మణస్వామి, కె.శివనాగేంద్ర, శీలం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

72వ సారి రక్తదానం చేసిన 'కస్తూరి'

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లికి చెందిన స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్త కస్తూరి విజయ్ కుమార్ 72వ సారి రక్తదానం చేశారు. మచిలీపట్నంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఎం.దేవకన్య అనే మహిళకు ఆపరేషన్ కోసం ఏ పాజిటివ్ రక్తం అవసరమైంది. మచిలీపట్నం మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు చల్లపల్లికి చెందిన కస్తూరి విజయ్‌కుమార్‌ని సంప్రదించగా మచిలీపట్నం వెళ్లి రక్తం ఇచ్చి వచ్చారు.

నత్తనడకన..

- గుంతలరహిత ఆంధ్రప్రదేశ్ పనులు
- ఆర్భాటమే.. క్షేత్రస్థాయిలో కానరాని పురోగతి
- కొడాలిలో 47 రోజులైన పూర్తికాని రోడ్డు

కొడాలి(ఘంటసాల): నత్తనడకన రోడ్డు పనులు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ పనులు సా..గుతున్నాయి. ఘంటసాల మండలం కొడాలి గ్రామంలో ప్రధాన రోడ్డుపై గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ గత నెల 2వ తేదీన కూటమి నేతలతో కలసి పెద్ద ఎత్తున ప్రారంభించారు. ఆ రోజు గుంతల్లో డస్ట్‌తో కలిపిన కంకర పోసి 47 రోజులవుతున్నా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. కొడాలి నుంచి శ్రీకాకుళం వెళ్లే రోడ్డు పనులను స్థానిక నేతలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా అందుబాటులోకి రాలేదు. ఆయా రోడ్లపై కంకర వేసి వదిలేయడం.. అవి పైకి తేలడంతో ద్విచక్ర చోదకులు అదుపుతప్పి పడిపోతున్నట్లు పలువురు వాపోతున్నారు. గతంలో గుంతలున్నా రోడ్డు కొద్దోగొప్పో బాగుండేదని, ఇప్పుడు ఉన్న రోడ్లపై తవ్వి కంకర పోయడంతో ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని వాహనచోదకులు అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



కొడాలిలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించిన రహదారి పరిస్థితి



గుంతలమయంగా కొడాలి - ఘంటసాల రహదారి



కొడాలిలో నవంబరు 2న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆర్భాటంగా ప్రారంభించిన పనులు (ఫైల్)

ఘంటసాల మండలంలో రూ.1.25 కోట్లు

గుడివాడ – చల్లపల్లి – కొత్తపల్లి రోడ్డులో భాగంగా ఘంటసాల మండలం కొడాలి నుంచి చిట్టూర్పు వరకు రూ.30 లక్షలు, కొడాలి నుంచి గుండేరు డ్రైన్ వంతెన వరకు రూ.25 లక్షలతో పనులు ప్రారంభించగా, మరో రూ.30 లక్షలతో శ్రీకాకుళం వరకు పనులు చేపట్టనున్నారు. ఘంటసాల నుంచి ఘంటసాలపాలెం వరకు రూ.40 లక్షలు మంజూరయ్యాయి. కొడాలి నుంచి చిట్టూర్పు, కొడాలి నుంచి శ్రీకాకుళం వెళ్లే రహదారుల పనులు మాత్రమే ప్రారంభం కాగా ఘంటసాల నుంచి ఘంటసాలపాలెం వరకు ఇప్పటి వరకు రహదారుల గుంతల పూడ్చే పనులను ప్రారంభించలేదు.

కూటమి ప్రభుత్వం విఫలం



గుంతల రహిత ఏపీలో భాగంగా రహదారులపై గోతులు పూడ్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. కొడాలి – చిట్టూర్పు, కొడాలి – శ్రీకాకుళం రహదారుల పనులు ప్రారంభించి కంకర పోసి వదిలేయడంతో రాళ్లు పైకి తేలి ప్రమాదకరంగా కనిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్భాటంగా ప్రారంభించిన గుంతలు పూడ్చే పనులు పూర్తి చేయాలి.

– గుంటూరు నాగేశ్వరరావు, బీఎస్పీ 'అవనిగడ్డ' ఇన్‌చార్జి

త్వరలోనే పనులు పూర్తి చేస్తాం

ఘంటసాల మండల పరిధిలోని కొడాలి – చిట్టూర్పు, కొడాలి – శ్రీకాకుళం వెళ్లే రహదారుల పనులు ప్రారంభించాం. వాతావరణం అనుకూలంగా లేకపోవడం, దమ్ము ట్రాక్టర్లు తిరగడంతో రహదారుల పనులు ఆలస్యమయ్యాయి. రెండు వారాల్లో ఆయా రోడ్లు పూర్తి చేయడంతో పాటు కొత్త పనులు ప్రారంభిస్తాం.

– ఎ.రాజేష్, ఆర్అండ్‌బీ డీఈఈ, అవనిగడ్డ

నేడు మండల సర్వసభ్య సమావేశం

కృత్తివెన్ను: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, స్థానిక సమస్యలు, అభివృద్ధిపై సమావేశంలో చర్చించి అవసరమైన పనులకు, మండల తీర్మానం పొందాలని పేర్కొన్నారు.

23న సర్వసభ్యసమావేశం

గూడూరు: గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ఉత్తరచిరువోలు లంకలో మాజీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి విడుదల చేసిన ఎంపీ నిధులు రూ. 10 లక్షలకు తోడు పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. లక్షతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ శ్రీనివాసరావు తెలిపారు. 7వ వార్డులో అసంపూర్తిగా మిగిలిన 25 మీటర్ల రహదారి నిర్మాణాన్ని సీసీ రోడ్డుగా గురువారం పూర్తిచేశారు. సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ జె.గౌతమి, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు, విశ్వనాథపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

అవనిగడ్డ: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఎదుర్కొనే అన్ని రకాల సమస్యలను సదస్సులతో పరిష్కరించనున్నట్లు చెప్పారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డెప్యూటీ కలెక్టర్ ఐ.పద్మావతి, సర్పంచ్ గొరుముచ్చు ఉమ, ఎంపీపీ తుంగల సుమతీదేవి, దేవదాయశాఖ మండల అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు అర్చకుల పేరున శిస్తు రశీదులు ఇవ్వాలని కోరుతూ రెవెన్యూ సదస్సులో డిప్యూటీ కలెక్టర్ పద్మావతికి పలువురు అర్చకులు వినతి పత్రం సమర్పించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో అర్చకులు దీవి రఘు, అప్పలాచార్యులు, దీవి సారంగపాణి డెప్యూటీ కలెక్టర్‌కు అర్జీ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ పరిధిలోని భూములకు వంశపారంపర్యంగా ఉన్న అర్చకుల పేరుతో శిస్తు రశీదులు ఇచ్చేవారని, ఇలా ఇవ్వొద్దని ఆదేశాలు రావడంతో అర్చకులకు నష్టం కలుగుతుందన్నారు. శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ పరిధిలోని రెండు ఎకరాల భూములను నివేశన స్థలాల కింద ఇచ్చారని వీటికి సంబంధించి అర్చకులకు పరిహారం ఇవ్వలేదని చెప్పారు. ఈ సమస్యలను పరిష్కరించి అర్చకుల కుటుంబాలకు మేలు చేయాలని కోరారు.



అవనిగడ్డలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

రెవెన్యూ సదస్సులో కులధ్రువీకరణకు అధిక దరఖాస్తులు

పెడన: భూ సమస్యలపైనే కాకుండా కుల ధ్రువీకరణ పత్రాలకు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడంతో చెన్నూరులో జరిగిన గ్రామ సభల్లో 50కు పైగా కుల ధ్రువీకరణ పత్రాలు అందినట్లు ఎన్నికల విభాగం డెప్యూటీ తహసీల్దార్ నరసింహారావు అన్నారు. గురువారం మండలంలోని మేజర్ పంచాయతీ చెన్నూరులో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మొత్తం 61 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో అధికంగా కులధ్రువీకరణ పత్రాలకు అర్జీలు ఇచ్చారన్నారు. రీ సర్వే డీటీ సల్మా, ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

నేడు చేవేంద్రలో సదస్సు

చేవేంద్ర సచివాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి రెవెన్యూ సదస్సు ఉంటుందని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోనేరుసెంటర్: మండల పరిధిలోని పోతేపల్లి పంచాయతీ శివారు ఉల్లిపాలెం, మాచవరంలలో గురువారం మీ భూమి మీ హక్కు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు కుంచే నాని, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(మోపిదేవి): అన్నవరం గ్రామానికి చెందిన రెవెన్యూ సదస్సు వెంకటాపురం సచివాలయం వద్ద సర్పంచ్ తుమ్మ సోములమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. తహసీల్దార్ ఎం.శ్రీవిద్య తెలిపారు. మండల రెవెన్యూ ప్రత్యేక అధికారి పి.విష్ణు, దేవదాయశాఖ అధికారిణి జోగి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలో గురువారం నిర్వహించి రెవెన్యూ సదస్సుల్లో 17 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యాన మండలంలోని రాయవరం, పోలవరం, ఐదుగుళ్లపల్లి, రామన్నపేట గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రాయవరంలో 11, ఐదుగుళ్లపల్లిలో 6 అర్జీలు వచ్చాయి. సర్వేయరు కె.మురళీకృష్ణ, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పైడమ్మ జాతర

పెడన: స్థానిక శ్రీపైడమ్మ జాతర మహోత్సవాలు గురువారంతో ఆరో రోజుకు చేరాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానికులు శిడిబండ్లకు పసుపు రాసి వేపాకులతో అలంకరించి బొమ్మలు పెట్టి పట్టణంలో ఊరేగుతూ నృత్యాలు చేస్తూ పసుపు జల్లుకుంటూ అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో టీవీవీ మోహనరావుతో పాటు దేవదాయ శాఖ సిబ్బంది, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసుల పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బంది కలగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. వైద్యారోగ్యశాఖ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసింది. అమ్మవారిని దేవదాయశాఖ ఏసీ నూతక్కి సాంబశివరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రప్రసాద్, పెడన ఎస్ఐ జి.సత్యనారాయణపర్యవేక్షణలో పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



జాతరలో నృత్యం చేస్తున్న భక్తులు

విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులపై శిక్షణ

భావదేవరపల్లి(నాగాయలంక): ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ(హైదరాబాద్), కృషి విజ్ఞాన కేంద్రం(ఘంటశాల) ఆధ్వర్యంలో స్థానిక మండలి కృష్ణారావు ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులపై గ్రామానికి చెందిన 30మంది మహిళలకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తుల తయారీలో నాణ్యత, పరిశుభ్రత, రుచికి ప్రాధాన్యమివ్వాలని, మహిళలు అవగాహనతో ముందుకొచ్చి సద్వినియోగం చేసుకుంటే మార్కెటింగ్‌కు ఢోకా ఉండదని పేర్కొన్నారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో మాదిరిగా దివితీరంలో ఉప్పుచేపలు, ఎండురొయ్యల మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తుల తయారీ విధానాలు వివరించారు. ఈ సందర్భంగా ఉత్పత్తుల శిక్షణ కరదీపిక, బ్రోచర్‌లను ఆవిష్కరించారు. అధ్యాపకులు డాక్టర్ అల్లి అశ్రిత, డాక్టర్ విశాల్‌కుమార్ రొయ్యల పచ్చడి తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, డాక్టర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

మార్కెట్‌లో క్రిస్మస్ సందడి



బందరులో ఓ దుకాణం వద్ద స్టార్లు, క్రిస్మస్ ట్రీలు



క్రీస్తు జనన ఇతివృత్తాన్ని వివరించే చిత్రం

మచిలీపట్నంటౌన్: నగర మార్కెట్‌లో క్రిస్మస్ సందడి నెలకొంది. ఈ నెల 25వ తేదీ క్రిస్మస్. ఈ పండగ సందర్భంగా నగరంలోని దుకాణాల వద్ద రంగురంగుల స్టార్లు, క్రిస్మస్ తాత బొమ్మలు, క్రిస్మస్ ట్రీలు, క్రీస్తు జనన ఇతివృత్తాన్ని వివరించే బొమ్మలు, రంగురంగుల విద్యుద్దీపాల దండలు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పండుగ దగ్గర పడుతుండటంతో విక్రయాలూ జోరందుకున్నాయి. రూ. 100 నుంచి వేలాది రూపాయల విలువైన వీటిని కొనుగోలు చేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లోని క్రైస్తవుల గృహాలు ఇప్పటికే రంగురంగుల స్టార్లతో, క్రిస్మస్ ట్రీలతో ఇల్లంతా విద్యుదీపాలు వెలుగులీనుతూ కన్పిస్తున్నాయి.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

మచిలీపట్నంటౌన్: రాజ్యాంగ నిర్మాత భారతరత్న బీఆర్అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం జై భీమ్‌సేన ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆ సంఘ నాయకులు నిరసన తెలిపారు. జైభీమ్‌సేన నాయకుడు బూరగ రామారావు, దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు(జానీ), నాయకులు దార్ల చెన్నకేశవరావు, వేము కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై వ్యాఖ్యలు చేయటం దారుణమని షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని దళిత జాయింట్ యాక్షన్ కమిటీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు (జానీ) గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.
- కుల వివక్ష వ్యతిరేక పోరాటం సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యాన గురువారం కోనేరు సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేశారు. అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. సంఘ మండల కార్యదర్శి పి.రాజు, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొడాలి శర్మ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చిత్రపటాలను దళిత సంఘాల నేతలు దగ్ధం చేశారు. స్థానిక వంతెన సెంటర్‌లో గురువారం దళిత సంఘాలు, మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన జరిగింది. కార్యక్రమంలో మాల మహానాడు నేతలు బత్తుల రాజు, మేరుగు రణధీర్, మద్దాల ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

● సచివాలయ గదుల్లో మద్యం సీసాలు!





అవనిగడ్డ 1 సచివాలయ గదుల్లో, మెట్లపై మద్యం బాటిల్స్ కనిపించాయి. ఇక్కడ పంచాయతీ ఆవరణలో సచివాలయాన్ని నిర్మించినా ఇంకా అప్పగించలేదు. ఈ గదులకు తాళాలు వేయకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడ రెవెన్యూ సదస్సుకు వచ్చిన అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఈ గదులను పరిశీలిస్తూ మద్యం సీసాలను చూసి ఆగ్రహం వ్యక్తం చేసి కార్యదర్శిని ప్రశ్నించారు. మందుబాబులు ఆవరణలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. –అవనిగడ్డ

అన్నదాతల్లో ఆందోళన



పాపవినాశనంలో ధాన్యం రాశులను బస్తాల్లోకి ఎత్తుతున్న ముఠా కార్మికులు



గోగినేనిపాలెం వద్ద కుప్పలు వేస్తున్న కూలీలు



ఘంటసాల-రామానగరం రోడ్డులో ధాన్యానికి పరదాలతో రక్షణ

ఘంటసాల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు అల్లాడిపోతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం జల్లులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు పరదాలు కప్పుతూ అష్టకష్టాలు పడుతున్నారు. ఓవైపు కుప్పలు వేసేందుకు కూలీలు డిమాండ్ చేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పనలపై ఉన్న పొలాలు, వరి కోయాల్సిన పొలాల రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చెప్పడంతో మా పరిస్థితి ఏమిటంటూ రైతులు, కౌలు రైతులు కన్నీరు పెడుతున్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్

మచిలీపట్నంటౌన్: లోకాన్ని రక్షించేందుకే ఏసు మానవ రూపంలో భువిలో జన్మించారని మల్కాపట్నం ఇండియన్ పెంతుకోస్తు చర్చి పాస్టర్ రెవరెండ్ అనుముల ఫిన్ని శామ్యూల్ అన్నారు. శారదానగర్‌లోని చర్చిలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, క్రిస్మస్ గీతాలాపనలతో సెమీక్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. కార్యక్రమంలో శారదానగర్ ఐపీసీ చర్చి పాస్టర్ చిన్నం రమణమ్మ, సంఘస్తులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

అడపవారిపాలెం(మోపిదేవి): రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను ఖండిస్తూ డ్వాక్రా సంఘం మహిళలు గురువారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. మండలంలోని పెదకళ్లేపల్లి శివారు అడపవారిపాలెంలో డ్వాక్రా గ్రూపు సభ్యులు నిరసన ప్రదర్శన చేశారు. ఏపీఎం శ్రీను, సీసీలు, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ



పూర్ణచంద్రరావు (ఫైల్)



మాణిక్యాలరావు (ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని తొమ్మిదో వార్డులో ఆర్యవైశ్య ప్రముఖుడు చిట్టా వెంకట పూర్ణచంద్రరావు(87), 11వ వార్డులో రైతు సబ్బినేని మాణిక్యాలరావు (85) అనారోగ్యంతో గురువారం మరణించగా వారి ఇద్దరి కార్నియాలను స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ద్వారా విజయవాడ తాడిగడపలోని ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. మరో ఇద్దరికి చూపునిచ్చే సంకల్పంతో వారి వారి కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందుకు వచ్చారు.

నేత్రదాన మోటివేటర్లుగా సామాజిక సేవలు అందిస్తున్న సేవాసంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకటనారాయణను సంప్రదించి సమాచారం అందించగా వారి సహకారంతో కంటి ఆస్పత్రి ల్యాబ్ టెక్నీషియన్ సాయి బృందం మృతుల నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకెళ్లారు. తమ సంస్థ మోటివేషన్ ద్వారా ఇప్పటికి సేకరించిన నేత్రాల సంఖ్య 218కి చేరిందని రఘుశేఖర్ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ఉత్సవాలు



పెడన: పట్టణంలోని శ్రీరుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవాలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, ఆండాళ్ల గోష్టి, మహిళా భక్తులు మంగళ హారతులతో దేవాలయానికి చేరుకుని గోదా శ్రీనివాస స్వామి అష్టోత్తర శతనామావళి జరిగింది. మహిళలు తిరుప్పావైను భక్తిశ్రద్ధలతో పఠించారు. ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం హరికృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్లకు పంచహారతి, నక్షత్రహారతి, ఏకహారతి, కుంభహారతి, నాగహారతి, త్రిముఖ, తదితర హారతులను వైభవంగా ఇచ్చారు.